మళ్లీ బెట్టింగ్ జాడలు

- చాపకింద నీరులా క్రికెట్ ఐపీఎల్ బెట్టింగ్‌లు
- జోరందుకున్న పేకాట
- దృష్టి సారించిన కావలి పోలీసులు
- నిర్వాహకులపై నిఘా



కావలి: పట్టణంతో పాటు సమీప మండలాల్లో క్రికెట్ బెట్టింగ్‌లు జోరందుకున్నాయి. గత కొంత కాలంగా స్తబ్దతుగా ఉన్న బెట్టింగ్‌లు ప్రస్తుతం ఐపీఎల్ సీజన్ నడుస్తుండడంతో రహస్యంగా పెద్ద ఎత్తున ముఠాలు తయారయ్యాయి. బెట్టింగ్‌లపై సమాచారం రావడంతో ముఠాలపై కావలి పోలీసులు దృష్టి సారించారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు డీఎస్పీ వెంకటరమణ పోలీసుల ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి నిఘా పెట్టారు. దాడులు ముమ్మరం చేసి క్రికెట్ బెట్టింగ్, పేకాట నిర్వాహకులపై ఉక్కుపాదం మోపుతున్నారు. బోగోలు మండలంలో ఇటీవలే 13 మంది పేకాటరాయుళ్లను, నిర్వాహకులను అరెస్ట్ చేసి రూ.2 లక్షలకుపైగా నగదు, వాహనాలు సీజ్ చేశారు. రెండు రోజుల క్రితం నెల్లూరుకు చెందిన క్రికెట్ బెట్టింగ్‌ల నిర్వాహకుడిని కూడా బోగోలులోనే అదుపులోకి తీసుకుని శుక్రవారం అరెస్ట్ చేశారు. బెట్టింగ్‌కు వినియోగిస్తున్న బ్యాంక్ ఖాతాలను గుర్తించి స్తంభింపచేశారు. ఖాతాల్లోని రూ.14 లక్షల నగదును కూడా సీజ్ చేశారు. క్రికెట్ బెట్టింగ్, పేకాటల్లో కీలకంగా ఉన్న పలువురి వివరాలు కూడా సేకరించి విచారణ ముమ్మరం చేసినట్లు తెలిసింది. తాజాగా నెల్లూరు నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఉడ్‌హౌస్‌పేటలో క్రికెట్ బెట్టింగ్‌కు పాల్పడుతున్న ఏడుగురిని పోలీసులు అరెస్ట్ చేశారు. దీంతో నిర్వాహకుల్లో ఆందోళన మొదలైంది. వీరితో పాటు సింగిల్‌నంబర్లాటపై కూడా ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తెలిసింది. కావలిలో క్రికెట్ బెట్టింగ్‌లతో యువత, సింగిల్ నంబర్లాటతో చిరువ్యాపారులు, ఆటోడ్రైవర్లు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నట్లు ఫిర్యాదులు వెల్లువెత్తడంతో పోలీసు యంత్రాంగం ప్రత్యేకంగా దృష్టి సారించినట్లుగా తెలిసింది. బోగోలు, దగదర్తి మండలాల పరిధిలో పేకాట స్థావరాలు ఏర్పాటు చేసి ప్రతిరోజూ రూ.లక్షల్లో ఆటలు ఆడిస్తున్నట్లుగా కూడా సమాచారం అందడంతో అధికారులు దాడులు ముమ్మరం చేశారు. ఇటీవల బోగోలులో ఆకస్మికంగా దాడులు నిర్వహించి నిర్వాహకులతో పాటు పేకాటరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల దాడులతో పేకాట, క్రికెట్ బెట్టింగ్‌ల నిర్వాహకుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి.

భారీ స్థాయిలోనే...

క్రికెట్ బెట్టింగ్‌లు, పేకాటను నిర్వాహకులు వ్యవస్థీకృతంగా నిర్వహిస్తున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. దగదర్తి, బోగోలు మండలాల్లోని అటవీ ప్రాంతాలు, తోటల్లో ఏర్పాటు చేస్తున్న పేకాట స్థావరాలకు జిల్లాతో పాటు ప్రకాశం జిల్లా నుంచి పేకాటరాయుళ్లను పిలిపించి పేకాట ఆడిస్తున్నట్లుగా తెలిసింది. ప్రతిరోజూ రూ.లక్షల్లో నగదు చేతులు మారుతున్నట్లుగా చాలా కాలం నుంచే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేకాటకు వచ్చే వారి కోసం నిర్వాహకులు అన్నీ సౌకర్యాలు కల్పిస్తున్నట్లుగా తెలిసింది. మద్యం, మాంసం వంటకాలు, భోజనాలతో పాటు అవసరమైతే రూ.10 వడ్డీకి అప్పులు కూడా ఇచ్చి పేకాట ఆడిస్తున్నట్లుగా తెలిసింది. క్రికెట్ బెట్టింగ్‌లు కూడా ఇదే తరహాలో నిర్వహిస్తున్నట్లుగా తెలిసింది. ఐపీఎల్ మ్యాచ్‌ల ఓవర్‌కు ఇంత, బాల్‌కు ఇంత అని బెట్టింగ్‌లు నిర్వహిస్తూ యువత జీవితాలతో ఆడుకుంటున్నట్లుగా తెలిసింది. ఈక్రమంలో పోలీసులు కఠిన చర్యలకు శ్రీకారం చుట్టడంతో ప్రజల నుంచి హర్షం వ్యక్తమవుతుంది.

క్లుప్తంగా

గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడి విహారం



గరుడ వాహనంపై శ్రీరామచంద్రుడి చిద్విలాసం

ఆత్మకూరురూరల్: మండలంలోని అప్పారావుపాళెంలో శ్రీరామనవమి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం శ్రీరామచంద్రుడిని గరుడ వాహనంపై విశేష పుష్పాలంకరణతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉభయకర్తలు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

వైభవంగా లేదోట గంగమ్మతల్లి జాతర



గంగమ్మతల్లికి నైవేద్యాలు సమర్పిస్తున్న భక్తులు

జలదంకి: జలదంకిలోని లేదోట గంగమ్మతల్లి జాతరను గ్రామస్తులు ఆదివారం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి గ్రామ పురవీధుల్లో గంగమ్మతల్లి ఉత్సవం నిర్వహించారు. ఆదివారం ఉదయం గంగమ్మతల్లి ఆలయంలో అమ్మ వారికి ప్రత్యేక అభిషేకాలు చేశారు. అనంతరం అమ్మవారికి అంబలి పోసి, పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో అన్నదానం నిర్వహించారు.

కనకదుర్గాదేవికి పొంగళ్లు



కనకదుర్గమ్మకు పొంగళ్లు పెట్టేందుకు వెళ్తున్న మహిళలు

ఆత్మకూరురూరల్: మండలంలోని రామస్వామిపల్లిలో శ్రీకనకదుర్గాదేవి ఆలయం 16వ బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం మహిళలు ఆలయం వద్ద పొంగళ్లు పెట్టి నైవేద్యాలు సమర్పించారు. అంతకుముందు అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు పెన్నానది జలాలతో అభిషేకం, దేవతామూర్తుల గ్రామోత్సవం కార్యక్రమాలు నిర్వహించారు. మహిళలు పెద్ద సంఖ్యలో బోనాలతో మేళతాళాలు, బాణసంచా మోతలతో ఊరేగింపుగా ఆలయం వద్దకు చేరుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

పిల్లల ప్రతిభకు పెద్దల ప్రోత్సాహం అవసరం



విద్యార్థులు పేపరుతో తయారు చేసిన వస్తువులు చూపిస్తున్న దృశ్యం

చేజర్ల (సోమశిల): తల్లిదండ్రులు తమ పిల్లలు చదువుతో పాటు వారు దేనిపై ఎక్కువగా మక్కువ చూపుతున్నారో ప్రోత్సహిస్తే తమ సృజనాత్మకతను పెంపొందించుకుంటారని ఆమనిచిరువెళ్ల సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ జి మాల్యాద్రి అన్నారు. ఆదివారం అనంతసాగరం గ్రంథాలయంలో జరిగిన వేసవి విజ్ఞాన శిక్షణా శిబిరంలో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులు రాకెట్, నక్షత్రం, జాతీయ జెండా, బర్త్‌డే గ్రీటింగ్స్ తదితర పేపర్ క్రాఫ్ట్‌లతో అలరించారు. ఈ కార్యక్రమంలో లైబ్రేరియన్ నారాయణరావు పాల్గొన్నారు.

తెలుగును పాలనా భాషగా అమలు చేయాలి

కలిగిరి: తెలుగు భాషను పాలనా భాషగా అమలు చేయాలని లోక్‌సత్తా ఉద్యమసంస్థ రాష్ట్ర సమన్వయ కమిటీ సభ్యుడు ఎం.మాలకొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు, ఉత్తర, ప్రత్యుత్తరాలు అన్ని తెలుగులోనే నిర్వహించేలా కృషి చేయాలన్నారు. ప్రాచీన తెలుగు భాషాభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు.

పర్యావణంపై అవగహన

ఉదయగిరి: స్థానిక బాపిస్టు చర్చిలో ఆదివారం అటవీ అధికారులు పర్యావణ సంరక్షణ ప్రాధాన్యతపై అవగహన కల్పించారు. నేడు మనిషి తన స్వార్థం కోసం చెట్లను నరికి ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తున్న వైనంపై డీఆర్వో శ్రీనివాసులు అవగహన కల్పించారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



ఆత్మకూరులో రాజీవ్ వర్ధంతి నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్మకూరు: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతిని ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం నిర్వహించారు. ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, పీసీసీ రాష్ట్ర కార్యదర్శి చేవూరు శ్రీధర్‌రెడ్డి నేతృత్వంలో నాయకులు మున్సిపల్ బస్టాండ్ ఆవరణలోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు వన్నం నాగరాజు, పి.మస్తానయ్య, ఎస్‌కే మస్తాన్, కె.వేణు, షబ్బీర్, రాంకీ తదితరులు పాల్గొన్నారు.



రాజీవ్‌గాంధీకి నివాళి అర్పిస్తున్న దృశ్యం

రాజీవ్‌గాంధీ వర్ధంతి

ఉదయగిరి: మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ 32వ వర్ధంతిని ఆదివారం ఉదయగిరిలో కాంగ్రెస్ పార్టీ నేతలు నిర్వహించారు. నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డి.రమేష్‌నాయుడు మాజీ ప్రధాని చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్పించారు. దేశానికి రాజీవ్ గాంధీ ప్రధానిగా చేసిన సేవలను గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో హాజరత్, ప్రశాంత్, శ్రీనివాసులు, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

30 నుంచి విగ్రహ ప్రతిష్టోత్సవాలు



నూతనంగా నిర్మించిన ఆలయం

ఉదయగిరి: పట్టణంలోని బ్రాహ్మణవీధిలో నూతనంగా నిర్మించిన కోదండరామ స్వామి ఆలయంలో ఈ నెల 30 నుంచి జూన్ 1వ తేదీ వరకు గణపతి, సరస్వతీ, సీతాలక్ష్మణ, హనుమత్ సమేత కోదండరామస్వామి నూతన విగ్రహ ప్రతిష్టా కుంభాభిషేక మహోత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు శుక్రవారం తెలిపారు. 30న గంగా నయనము, గణపతిపూజ, పుణ్యాహవచనం, నవగ్రహ మండపారాదన, కలశస్థాపన తదితర పూజా కార్యక్రమాలు, 31న ప్రత్యేక పూజలు, హోమాలు, గ్రామోత్సవం, మహాస్నపనం, 1న విగ్రహ ప్రతిష్ట, కల్యాణ మహోత్సవం జరుగుతాయన్నారు.

రేపు దివ్యాంగుల గుర్తింపు శిబిరం

సీతారామపురం: ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, ఆత్మకూరు డెవలప్‌మెంట్ ఫోరం సహకారంతో ఆత్మకూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దివ్యాంగులకు ఉపకరణాల పంపిణీకి గుర్తింపు శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన వారికి ట్రైసైకిళ్లు, వీల్‌చైర్స్, వినికిడి యంత్రాలు, బ్యాటరీ ట్రై సైకిళ్లు, తదితర పరికరాలు పంపిణీకి పరీక్షలు నిర్వహిస్తారన్నారు. దివ్యాంగులు శిబిరానికి హాజరయ్యేటప్పుడు సదరం సర్టిఫికెట్, ఆధార్, రేషన్ కార్డు జెరాక్స్ కాపీలతో పాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు తీసుకెళ్లాలన్నారు.

సృజనాత్మకతపై వేసవి శిక్షణ

ఆత్మకూరు: ఆత్మకూరు గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరంలో ప్రత్యేకించి సృజనాత్మకత అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నట్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని లైబ్రేరియన్ ఓంకారం శ్రీనివాసరాజు అన్నారు. పట్టణంలోని గ్రంథాలయంలో ఆదివారం పలు పాఠశాలల విద్యార్థులకు విశ్రాంత ఉపాధ్యాయుడు వెలిశెట్టి నారాయణరావు ద్వారా సృజనాత్మకత అంశాలు, ఊహాశక్తితో పాటు జ్ఞాపకశక్తి పెరిగే అంశాలపై శిక్షణ ఇప్పించారు. విద్యార్థులకు డ్రాయింగ్, పేపర్ క్రాఫ్ట్, తదితర అంశాలను ప్రాక్టికల్‌గా చేయించారు. కొన్ని పజిల్ పుస్తకాలను వారికి ఇచ్చి వారి విజ్ఞానాన్ని ప్రశ్నల ద్వారా పరీక్షించారు. ఈ కార్యక్రమంలో రీసోర్స్ పర్సన్ ఎ వెంకటేశ్వర్లు, లైబ్రరీ అసిస్టెంట్ ఎల్.తనూజ, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.



ఆత్మకూరు లైబ్రరీలో వేసవి శిక్షణా శిబిరం నిర్వహిస్తున్న దృశ్యం

పీఎంకిసాన్ ఈ-కేవైసీకి ఫేస్ ఐడెంటిఫికేషన్

కొడవలూరు: పీఎం కిసాన్ ఈ కేవైసీకి వేలిముద్రలు పడని రైతుల సౌకర్యార్థం ఫోన్‌లో ఫేస్ ఐడెంటిఫికేషన్ సదుపాయం కల్పించారని ఏఓ లక్ష్మి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. వేలి ముద్రలు పడని రైతులు ఆర్బీకేలలో సంప్రదించి ముఖచిత్రం ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవాలని సూచించారు.

యోగాపై అవగాహన సదస్సు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): శాస్త్రీయ యోగా శిక్షణ తరగతులపై అవగాహన సదస్సును బాలాజీనగర్‌లోని సాయిదర్బార్ అద్దాల మందిరంలో ఆదివారం నిర్వహించారు. యోగా శిక్షకులు చలపతి, మల్లికార్జునరావు, యోగా మిత్రమండలి అధ్యక్ష, కార్యదర్శులు విజయకుమార్‌రెడ్డి, రవీంద్ర, పద్మావతి, నజీర్‌బాషా, శ్రీరాములు, చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ విభాగం ఉద్యోగుల నూతన కార్యవర్గ ఎన్నిక



ఆత్మకూరు సబ్ డివిజన్ వ్యవసాయ విభాగం అసోసియేషన్ నూతన కార్యవర్గ సభ్యులు

ఆత్మకూరురూరల్: రైతు భరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులు, పశుసంవర్ధక సహాయకుల ఆత్మకూరు డివిజన్ స్థాయి నూతన కార్యవర్గ ఎన్నిక ఆదివారం జరిగింది. జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ బ్రహ్మేంద్ర మాట్లాడుతూ జిల్లాలోని 9 వ్యవసాయ సబ్ డివిజన్ల పరిధిలో నూతన కార్యవర్గ ఎన్నికలు నిర్వహించామని తెలిపారు. రైతుభరోసా కేంద్రాల్లో పనిచేస్తున్న ఉద్యోగుల న్యాయపరమైన హక్కుల కోసం తన అసోసియేషన్ పని చేస్తుందన్నారు. ఆత్మకూరు సబ్ డివిజన్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఏఎస్‌పేటకు చెందిన శ్రీహరిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ కార్యదర్శి సాయిమహేష్, కోశాధికారి నాగేంద్రప్రసాద్, ఉపాధ్యక్షులుగా షేక్ యస్దానీ, పఠాన్ ఇమ్రాన్‌ఖాన్, జాయింట్ సెక్రటరీ హాసన్‌కుమార్, కార్యవర్గ సభ్యులు ఈశ్వర్, సబ్ డివిజన్ పరిధిలోని వీఏఏలు, వీహెచ్ఏలు పాల్గొన్నారు.

వడదెబ్బపై అవగాహన పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న డీఎం శ్రీనివాసులు తదితరులు

కావలి: వేసవి నేపథ్యంలో వడదెబ్బ బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని ఆర్టీసీ కావలి డిపో మేనేజర్ రాపూరు శ్రీనివాసులు తెలిపారు. ఆదివారం బస్టాండ్ ఆవరణలో వడదెబ్బ తగులకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోస్టర్లను ఆవిష్కరించారు. డిపో మేనేజర్ మాట్లాడుతూ బస్సు సిబ్బంది, ప్రయాణికులు దూర ప్రాంతాలకు ప్రయాణించే సమయంలో మంచి నీళ్లు వెంట తీసుకెళ్లాలని, పలుచటి, వదులు దుస్తులు ధరించాలన్నారు. కావలి రెడ్‌క్రాస్ కార్యదర్శి గంధం ప్రసన్నాంజనేయులు మాట్లాడుతూ మజ్జిగ, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లు వంటి సహజ పానియాలను తాగాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.రమేష్‌బాబు, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్ డి.రవిప్రకాష్, రెడ్‌క్రాస్ సభ్యులు ఏజే మల్లేశ్వరరావు, కార్మిక నాయకులు జి విజయ్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మర్రిపాడు(ఆత్మకూరురూరల్): మండలంలోని నందవరం మోడల్ స్కూల్‌లో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ప్రిన్సిపల్ పేట శ్రీనివాసులురెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆన్‌లైన్ ద్వారా ఎంపీసీ, బైపీసీ, ఎంఈసీ, సీఈసీ గ్రూపుల్లో చేరేందుకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. జిల్లాలోని ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతిలో ఉత్తీర్ణులైన విద్యార్థులు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 22 నుంచి వచ్చే జూన్ నెల 7వ తేదీ వరకు నెట్ బ్యాంకింగ్ పద్ధతిలో కూడా అప్లికేషన్ రుసుం చెల్లించిన వారికి ఒక జనరల్ నంబరు కేటాయిస్తామన్నారు. ఆ నంబరు ఆధారంగా ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకునే విద్యార్థులు ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ తరగతులకు చెందిన వారు రూ.200, ఎస్సీ, ఎస్టీ తరగతులకు చెందిన రూ.150 చొప్పున ప్రవేశ దరఖాస్తు రుసుం చెల్లించాలన్నారు. మెరిట్ రిజర్వేషన్ నిబంధనల ప్రకారం పదో తరగతి మార్కులు ఆధారంగా ప్రవేశాలు నిర్ణయిస్తారన్నారు. ఇతర వివరాలకు మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ లేదా మండల విద్యాశాఖ అధికారిని సంప్రదించాలని కోరారు.

జగనన్న ఆణిముత్యాల ఎంపిక



లక్ష్మీ శ్రీనిధి



మహిమచౌదరి

జలదంకి: జలదంకి ఉన్నత పాఠశాలలో ఇటీవల 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన పులుగుంట లక్ష్మీశ్రీనిధిని జగనన్న ఆణిముత్యాలు అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓ శ్రీధర్ ఆదివారం తెలిపారు. లక్ష్మీశ్రీనిధి 600 మార్కులు 581 సాధించి నియోజకవర్గ స్థాయిలో తృతీయ స్థానంలో నిలిచింది. శ్రీనిధిని పాఠశాల హెచ్ఎం కొండారెడ్డి, ఉపాధ్యాయులు అభినందించారు.

చేజర్ల: చేజర్ల మండలంలోని నాగులవెలటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి 10వ తరగతి పరీక్ష ఫలితాల్లో మంచి మార్కులు సాధించిన ఐ.మహిమ చౌదరి జగనన్న ఆణిముత్యం అవార్డుకు ఎంపికైనట్లు ఎంఈఓ జి.శ్రీనివాసులు ఆదివారం తెలిపారు. మహిమచౌదరి 600 మార్కులకు 584 మార్కులు సాధించి నియోజకవర్గ స్థాయిలో ద్వితీయ స్థానంలో నిలిచింది. మహిమ చౌదరిని పాఠశాల హెచ్ఎం బొల్ల శైలజ, ఉపాధ్యాయులు అభినందించారు. జగనన్న ఆణిముత్యాలను త్వరలోనే సత్కరించనున్నట్లు అధికారులు తెలిపారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



ద్విచక్ర వాహన చోదకులకు జరిమానా విధిస్తున్న ఎస్సై సూర్యప్రకాష్‌రెడ్డి

కలిగిరి: వాహనచోదకులు వాహనాలు నడిపే సమయంలో నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని ఎస్సై ఎం.సూర్యప్రకాష్‌రెడ్డి హెచ్చరించారు. కలిగిరిలో ఆదివారం వాహనాలను తనిఖీ చేసి పలువురికి జరిమానాలు విధించారు. ఆయన మాట్లాడుతూ మైనర్లకు నడపడానికి వాహనాలు ఇవ్వరాదన్నారు. ఆటోడ్రైవర్లు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదని, యూనిఫాం ధరించాలన్నారు. కలిగిరిలో ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగిస్తూ ప్రధాన రహదారిపై వాహనాలను అడ్డదిడ్డంగా నిలపరాదన్నారు. వాహనాలు నడిపే సమయంలో డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు అన్ని ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు.

అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట

- రోడ్డుపై అడ్డంగా విరిగి పడిన చెట్టు



ఆత్మకూరు: మూడు రోజుల క్రితం భీకరంగా వీచిన గాలులకు తోడు వర్షంతో ఆత్మకూరు–సోమశిల మార్గంలో పలు చెట్లు నేలవాలాయి. భారీ వాహనాలు ఎదురుగా వచ్చినప్పుడు ఇరువైపులా వాహనాలు వెళ్లలేని పరిస్థితి నెలకొంది. గాలీవానా వచ్చి మూడు రోజులు దాటినా రహదారులు, భవనాల శాఖ అధికారులు రోడ్డుకు ఇరువైపులా పడి ఉన్న చెట్లను తొలగించకపోవడం నిర్లక్ష్యానికి పరాకాష్టగా ఉందని ప్రయాణికులు ఆక్షేపిస్తున్నారు. ద్విచక్ర వాహనదారులు దగ్గరకు వస్తే గానీ పరిస్థితి అర్థంగాక ప్రమాదాలకు గురవుతున్నారు. అధికారులు నిర్లక్ష్యం వీడి వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు కోరుతున్నారు.

చిట్టడవిని తలపిస్తున్న పార్క్

- ఆత్మకూరు నడిబొడ్డున ఖాళీ స్థలంలో ముళ్లపొదలు
- రెండు శాఖల మధ్య వివాదంతో ఈ దుస్థితి



ఆత్మకూరులో ఎస్ఎంకే పార్కు తమదిగా పేర్కొంటూ తపాలాశాఖ వారు దశాబ్దాల క్రితం ఏర్పాటు చేసిన బోర్డు

ఆత్మకూరురూరల్: విలువైన ప్రభుత్వ ఆస్తిని దశాబ్దాలుగా పట్టించుకునే నాథుడు లేకపోవడంతో విషసర్పాలకు నిలయంగా మారింది. ఆత్మకూరు నడిబొడ్డున ఎస్ఎంకే పార్కు పేరుతో ఉన్న ఈ ప్రాంతం అడవిని తలపించే రీతిలో ఉంది. రెండు శాఖల మధ్య వివాదం దశాబ్దాలుగా కొనసాగుతోంది. ఆయా శాఖల తీవ్ర నిర్లక్ష్యానికి నిదర్శనంగా నిలిచింది. వివరాల్లోకెళ్తే.. ఆత్మకూరు సర్వే నంబరు 854/1బిలో 48 సెంట్లు, 855/3లో 7 సెంట్లు స్థలంలో ఎస్ఎంకే పార్కుగా ఉంది. దశాబ్దాలుగా వివాదంతో ఆ స్థలం నిరుపయోగంగా మారింది. దీంతో ముళ్ల చెట్లు ఏపుగా పెరిగి వ్యర్థాలతో పట్టణ నడిబొడ్డున దుర్భరంగా ఉంది.

మాదంటూ.. తపాలా శాఖ

ఈ పార్కు స్థలం తమదేనంటూ తపాలా శాఖ బోర్డు పెట్టి 40 ఏళ్లు గడిచాయి. అయితే శాఖాపరంగా వినియోగించిన దాఖలాలు ఇప్పటికీ లేవు. అదే సమయంలో రెవెన్యూ శాఖ ద్వారా స్వాధీనపరిచిన ఈ స్థలం వరసగా మూడేళ్లలో వినియోగించకుంటే స్థలం పొందిన వారి హక్కులు సహజ సిద్ధంగా రద్దు అవుతాయని రెవెన్యూ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో పంచాయతీగా ఉన్న ఆత్మకూరు మండల కేంద్రంగా, రెవెన్యూ డివిజన్ కేంద్రం, మున్సిపాలిటీ కేంద్రంగా సబ్ డివిజన్ స్థాయి కార్యాలయాలు కూడా ఏర్పాటు కావడంతో ఉదయగిరి, ఆత్మకూరు నియోజకవర్గాల నుంచి ఆత్మకూరు కేంద్రంగానే ప్రభుత్వ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఇంత అభివృద్ధి సాధించిన ఆత్మకూరులో ఎస్ఎంకే పార్కు చుట్టూ పోలీసుస్టేషన్, కోర్టు, సబ్ రిజిస్ట్రార్, సబ్ జైలు, సబ్ ట్రెజరీ, తహసీల్దారు, డీఎస్పీ, అటవీశాఖ, హైస్కూల్, ఇరిగేషన్, విద్యుత్ శాఖ, తదితర పదికిపైగా అతి కీలకమైన ప్రభుత్వ కార్యాలయాలు ఉండడంతో వివిధ పనుల కోసం నిత్యం వేలాది మంది ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. ఈ కార్యాలయాలు అన్నింటి మధ్యలో ఉన్న ఎస్ఎంకే పార్కు విషసర్పాల నిలయంగా ముళ్ల చెట్లు, వ్యర్థాలతో దుర్గంధం, అపరిశుభ్రత వెదజల్లుతూ ఆ మార్గాన రాకపోకలు సాగించే వారికి నరకాన్ని చూపిస్తోంది. పరిశుభ్రతలో రెండుసార్లు రాష్ట్ర స్థాయి అవార్డులు అందుకున్న ఆత్మకూరు మున్సిపాలిటీ కూడా ఈ పార్కు దుస్థితిని పట్టించుకోకుండా తమకు సంబంధం లేనట్లు వదిలేయడంతో విషసర్పాలకు కేంద్రంగా మారింది. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు, ప్రజాసంఘాలు స్పందించి కనీసం పార్కు స్థలంలో ముళ్ల చెట్లు తొలగించి నీడనిచ్చే చెట్లు పెంచితే వందలాది ప్రజలకు పార్కు పక్కనే ఉన్న ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు కూడా ఎంతో సౌలభ్యంగా ఉంటుంది. ఆ దిశగా తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఎస్ఎంకే పార్కు మీదుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే ప్రధాన రహదారి

ఉన్నతాధికారులకు నివేదిస్తాం



పదికిపైగా ప్రభుత్వ శాఖల కార్యాలయం సముదాయం మధ్యలో ఉన్న ఎస్ఎంకే పార్కు 55 సెంట్ల విస్తీర్ణంలో ఉంది. దశాబ్దాల క్రితం తపాలా శాఖకు కార్యాలయ భవన నిర్మాణం కోసం చేసిన విజ్ఞప్తి మేరకు రెవెన్యూ శాఖ అనుమతులు ఇచ్చింది. కానీ ఇన్నేళ్లు గడిచినా వారు దానిని సద్వినియోగం చేసుకోలేదు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా సదరు స్థలాన్ని ప్రజోపయోగం చేయడానికి ప్రయత్నిస్తాం. ఉన్నతాధికారులకు నివేదికలు పంపి తదుపరి చర్యలు తీసుకుంటాం.

– లక్ష్మీనరసింహం, తహసీల్దారు, ఆత్మకూరు

భవన నిర్మాణానికి చర్యలు



ఆత్మకూరులో తపాలా శాఖ కార్యాలయ నిర్మాణం కోసం అనేక కారణాలు వల్ల ఇన్నాళ్లు సద్వినియోగం చేసుకోలేకపోయాం. గత మార్చి నెలలో నెల్లూరులో జరిగిన సమీక్ష సమావేశంలో రాష్ట్ర స్థాయి ఉన్నతాధికారులు తపాలా భవన నిర్మాణానికి తగు ఆదేశాలు ఇచ్చారు. త్వరలోనే భవన నిర్మాణ ప్రక్రియ ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్, ఏఎస్పీ, ఆత్మకూరు తపాలా సబ్ డివిజన్